# 49వ పుష్పము

49. ఓం శ్రీ సాయి - సర్వాధారాయ నమః

1) నామ పారాయణ ప్రియుడు

ఆధారము = ప్రాపు, అధిష్ఠానము = ఆలంబనము

లోకాధిష్ఠానుడు = "తమ నాధార మాధార మధిష్టాయ త్రయో లోకాస్తిష్ఠన్తీతి లోకాధిష్ఠా పరబహ్మ" = అనాధారమైన పరబ్రహ్మము నాధారము చేసికొని ముజ్జగములు వసించుచున్నవి. కావున లోకాధిష్ఠానమైన వాడు.

ఆధారనిలయుడు : "పృథివ్యాదీనాం పంచ భూతానా, మాధారాణా మాధార త్వాత్ ఆధార నిలయః = ఆధారములగు పృథివ్యాది పంచ భూతములకు నాధారుడు.

భూతభృత్తుడు "సత్వగుణ మధిష్టాయ భూతాని; బిభర్తి, పాలయతి, ధారయతి పోషణతీతి నా భూతభృత్" = సత్వగుణమును ఆశ్రయించి భూతములను, పాలించువాడు లేక ధరించువాడు లేక పోషించువాడు.

అధిష్ఠానుడు = "అధివిష్ఠన్తి భూతాని ఉపాదాన కారణత్వేన బ్రహ్మేతి అధిష్ఠానమ్" మత్స్థాని 'సర్వభూతాని' ఇతి భగవత్వచనాత్ (9-4) = సకల భూతములకును పాదానకారణముగ నుండు బ్రహ్మమైనవాడు.

"సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి" = ఏ దేవునకు నమస్కారం చేసినా నాకే చెందుతుంది. అన్ని నామములు, రూపములు నావేగా," అన్నారు స్వామి. అన్నీ సృష్టించి, అన్నిటిలోను తానే ప్రవేశించాడు సాయీశ్వరుడు. అంతా సాయి మయం. అటువంటి స్వామికి నమస్కారములు.

2) కవీశ్వరుడు - సత్యసేవలు

ప॥ తమ జీవితంబు త్యాగంబు గావించు ।
ధర్మాత్ములుందురు ధరణియందు,
పరుల సౌఖ్యము కోరి బలియైనవారెందరో ।
ఉందురు. ఈ కాలమందు కూడ.
కలలో కూడ ఇలలేని సౌఖ్యంబుల్ ।
కలువరింపని వారు కలరు ధరణి
కాని దేహేంద్రియముల । అరికట్టి మనసు నిలిపి
సత్య సేవలు కావించేడి వారు కలరా ।

దివ్య ప్రకటన (Cont.) : మీ బాధలు తగ్గించగలుగుతున్నాను. నన్ను పొగిడినప్పుడు నేను ఉప్పొంగను. నన్ను తక్కువ అంచనా వేసినప్పుడు నేను క్రుంగిపోను. బహు కొద్దిమందే నా ఆశయము, దాని ప్రాముఖ్యత, అర్థము చేసుకోగలిగిన వారు, దానికి నేనేమి బాధపడను. నేను ఎప్పుడు "అవును, అవును, అవును" అంటాను. మీరు త్యాగము చేసి, భగవంతుని శరణు పొందితే, ఆయనే మిమ్ములను రక్షిస్తాడు. మార్గము చూపుతాడు. భగవంతుడే ఈ అవతారముగా వచ్చాడు. ఆయన ఈ పని తప్పక చేస్తానని ప్రకటిస్తున్నాడు. ఆ కర్తవ్యమే, ఆయనను ఇక్కడికి రప్పించింది. ఈ పని తప్పక అవుతుందని ప్రకటిస్తున్నారు. మీ హృదయాలలో ఉండే ఆవేదనలు నాకు తెలుసు. మీ ఆశయములు తెలుసు. కాని మీకు నా హృదయము తెలియదు.

3) సకలతత్త్వ బోధకుడు - జగత్తు - రజ్జుసర్ప భ్రాంతి

"అస్తంగతయా, క్షీణయా, మస్యాం, జ్ఞానేన రాగవ"

ఈ అవిద్య క్షయించి, నాశన మొందనిదియు, ఎట్లు కల్గెనో, ఎట్లు వృద్ధి నొందెనో ఎట్లు నశించెనో, యను అంశమును, తెలిసికోగలవని వశిష్ఠులవారు, రాఘవునకు తెలిపిరి.

ఈ ఉపదేశమునందు ఒక రహస్య మున్నది. ఈ ప్రపంచం, ఎచ్చటనుంచి ఎటుల వచ్చినదని, యుగ యుగ ములు విచారించినను తెలదు. ఏ విద్య వలన, అవి ఎచట నుండి యైనను వచ్చియుండినచో, విచారణ ఫలితము యుండును. కాని జగత్తు అట్టి విషయము కాదు. జగత్తు ఎటుల కలిగెను? అనే ప్రశ్న రజ్జు సర్ప భ్రాంతి యందు, సర్పము ఎటుల ఉద్భవించినది? అను ప్రశ్నకు తుల్యము. అచట ఉన్నది త్రాడు. కాని ఆ స్థానము నుండి సర్పము ఉద్భవించినది. ఈ సర్ప ఉద్భవ కారణము. చూచునట్టివాని బుద్ధియందు గల దోషము లేక భ్రమ, లేక అజ్ఞానము. కావున సర్పము ఆవిర్భావ కారణము వలన పుట్టెను. అను జవాబు యుక్తి విరుద్ధము. అటులనే, తాడు స్థానమున వున్న బ్రహ్మము, పాము స్థానమున యున్నది. జగత్తు అనగా బ్రహ్మమునే, మనము భ్రాంతి వలన జగత్తుగా తలంచి వ్యవహరించుచున్నాము. ఇచ్చట కూడా చూచునట్టి వాని దోషము అనక తీరదు. అనగా ఒక వస్తువును మరియొక వస్తువుగా చూచుట బుద్ధి దోషమని తెలుచున్నది. కావున జగత్తు నా బుద్ధి దోషము వలన, ప్రభావించిన విషయమని, నిశ్చయింపనగును. ఇట్టి బుద్ధి దోషము వలన, భ్రాంతివలన జనించిన విషయం, ఎప్పటికిని సత్యము కాదు. భ్రాంతి నశించినప్పడు, తజ్జనిత విషయము కూడా నశించును. యదార్థము గోచర మగును. ఇదే వేదాంతసారము.

అహం అజ్ఞానః = నేను అజ్ఞానిని అని, ఎవరికి వారు ఒప్పకొనక తప్పదు. అనగా శాస్త్ర సిద్ధాంతము నేను పరి శీలించిచూడ, బ్రహ్మమై యుండియు, అట్లు తెలియక జీవుడని అనుకొనుచున్న నేనే అజ్ఞానినని తెలియవచ్చినది. అయితే తన్ను తాను మరచి, అన్యముగా తలంచుకొనుటయను విషయము సంభవమా? అను సంకోచ నివార ణార్థము, అనేక విషయములు తెలిసికొనవలయును. ఎవడు మిథ్యా దృష్టితో కూడి యుండునో, వానిని యజ్ఞాని అనుట సమంజసము. ఈ భ్రాంతి పురుషుని చిత్తము నాశ్రయించి యున్నది. దాని వలన, తన నిజస్వరూపము ను, విస్మరించి, అనగా ఆనంద స్వరూపమును మరచి జీవునిగా భ్రమించి సుఖము అన్యయమున కలదని, సంసారమునబడి, పరిభ్రమించుచుచున్న వారిని గూర్చి, "ఆత్మను వెతికి తెలిసికొని, ధన్యుడవు కమ్మని" శ్రుతి బోధించుచున్నది. అద్వైత ప్రబోదము నిజముగా జ్ఞానమును ఒక వస్తువు కలదని, ఋజువు చేసి, నిరాకరించుటకు ప్రవర్థిల్లుట లేదు. "నాకు సుఖముగా లేదు. నాకు ఇది కావలయును, దానిని నేను సాధించవలయును. అనుభవింపవలయును" అనునట్టి బుద్ధియే జీవత్వము. ఇట్టి బుద్ధినే అజ్ఞాన మందురు. కావున జీవత్వము నశింపవలెనన్న, ఇట్టి బుద్ధి "నేను సుఖ స్వరూపుడను, ఆప్తకాముడను" అను వానిని తెలివిగా పరిగణించ వలయును. పై భాగమునకు అజ్ఞానమనియు, రెండవ భావమునకు జ్ఞానమనియు, అనగా జీవత్వ బుద్ధి అజ్ఞానము, సుఖ స్వరూపుడను బుద్ధి జ్ఞానము లేని చిక్కులు నెత్తిపైన వేసుకొని, గిలగిలా తన్నుకొనుచూ, చచ్చుచూ, పుట్టుచూ, బంధములో నున్నానని తన్నుకొనుచున్న, జీవుని అజ్ఞానమునుండి తొలగించుటకు, నీవట్లు అనుకొనుటయే అజ్ఞానము సుమీ, అని నిర్వచించి, నిజ జ్ఞానమును కలుగజేయుటకే అద్వైత శ్రుతులు ఉద్భవించినవి. బందీకృతులమని అనుకొనుచున్నప్పడు మనమే అజ్ఞానులము. యదార్థముగా మనము దేని వలనా సృజింపబడలేదు. కించి జ్ఞానిగా చేయబడలేదు. ఈ జగత్తు కలదని, ఇందుగల భాగ్య జాతములలో, నేనొకడనని, నేను జనన మరణాదులు, సుఖ, దుఃఖములు కలవాడనని, అనుకొనుటయే అజ్ఞానం. "యద్భావం తద్భవతి" ఎట్లు తలంచుకొనిన అట్లు అగును. ఈ విధముగనే మానవుడు, అట్లు పొందుటకు ఆధ్యాత్మిక దృష్టి. శ్రద్ధ, భక్తి, ఈశ్వరానుగ్రహము లేని కారణము అట్లు బాహ్యముగా విచారించగా, ప్రపంచమని లేని దానిని, ప్రపంచము కాని దానిని మనము అజ్ఞానము వలన వున్నదని అనుకొనుట వలన, జనించుటయేయని తెలుచున్నది. అనగా సర్వము, అజ్ఞాన జనితమని తెలుసు. కావున ఇంతటి బ్రహ్మాండము చివరకు "నేను" అనుకొనుట, "నేను" అనుకొనక పోవుటలో, ఆధారపడియున్నదన్న మాట. చాలా విచిత్రముగా యుండును.

సృష్టి మనము లేదనుకొనుట వలన కలిగిన, నశించగలదని నిర్వచించగలిగినా నీవు అనుకొనుట విషయ మును, లోతుగా తరచి చూడవలసి యున్నది. ఇట్లు కలదనుటలో, ఒక వస్తువు యొక్క ఉనికి, కలిగిలేదనుకొను టలో అట్టి వస్తువు పోవుట మన అనుభవములో ఎచ్చటనైనా కలదా? లేక, ఊహా ప్రపంచము యొక్క విహారమా? అని విచారించిన, ఒకచోట అసత్యము ఋజువగుచున్నది. త్రాటిని చీకటిలో చూచి, పొరబాటున, అజ్ఞానము వలన, పామని అనుకోవటం తటస్థించిన యడల, త్రాటిస్థానము, పాము నిర్మించబడి విలసిల్లుచున్నది కారణార్థమున, యదార్థము గోచరించినప్పడు, "ఇది పాము కాదు, త్రాడు" అనుకొనడంతో, ఇదివరకు పాము అనుకొనుట వలన పామగను, కాదనుకొనుట వలన త్రాడుగను, సృజింపబడినది. ప్రత్యక్ష అనుభవమగు, పాము మిథ్యయనియు తేలినది. కావున అనుకొనుటలో, సృజింపులు వినాశములు, జరుగవచ్చునని సిద్ధాంతంపై, ఉదాహరణ మూలమున కొంత సుబోధకము కాగలదు. కావున అనుకొనుట అనినను, తలచుట అనినను, అవి మనోవికార జాతములు అగుట వలన, స్థూలముగ తలంపులని పరిగణించ వచ్చును. ఎన్ని అవాంతర భేదము లున్నను, సూక్ష్మముగ చూచిన, అన్నియు తలంపులేకదా? ఇచ్చట తలంపులు, స్వయముగా పుట్టుచున్నవా? అన్న ప్రశ్నకు "బుద్ధి కర్మానుసారిణీ" మన కర్మలు అనురాగము చేత, కర్మఫల ప్రేరణ చేత ఆచరించిన పనులను అనుసరించి, తలంపులు పుట్టును. నాకు సుఖ శాంతులు కావలయును, అను తలంపు మొదటిది. ఇది జగత్తు, ఇది సత్య భావము చేత, అజ్ఞానము చేత కలుగును. రెండవది నేను సుఖ స్వరూపుడను, అనేది సత్యము జ్ఞానము చేత కలుగును.

4) జ్ఞాన స్వరూపుడు - గౌడపాదకారికలు (మాండూకోపనిషత్తు)

అలాంత శాంతి ప్రకరణము :

1వ శ్లో॥ తా॥ ఆకాశంతో సమానమైనట్టియు, జ్ఞేయము కంటె (తెలిసికొనదగిన ఆత్మకంటె) భిన్నము కానిది యును, జ్ఞానము చేత ఆకాశ తుల్యమును (ఆత్మ స్వరూపము కంటె వేరుకానిదియును) ఆత్మ ధర్మముల చక్కగ నెరింగిన అట్టి పురుష శ్రేష్ఠులలో శ్రేష్ఠుని (పురుషోత్తముడగు నారాయణు సాయి పరమేశ్వరుని గూర్చి) నమస్క రించుచున్నాను (2) సకల ప్రాణులకు శుభకరమును, హితము చేయదగినదియును, పక్ష-ప్రతిపక్షములను గ్రహించి, విరుద్ధముగా పలుకునదియు, విరుద్ధము కానిదియును అస్పర్శయోగమని బ్రహ్మ వేత్తలలో ప్రసిద్ధి సుయోగముగల, ఏ శాస్త్రము చేత ఉపదేశింపబడినదో, అట్టి శాస్త్రమునకు నేను నమస్కరించుచున్నాను. (30) ఈ ప్రాణాది పదార్థములు, ఆత్మకంటె వేరైనవి కాకపోయినను, వీనికంటె వేరుగా, సర్పాది వికల్పముచేత (రజ్జు సర్ప భ్రాంతిలో) రజ్జువు వలె, అజ్ఞానుల చేత చూడబడుచున్నాడు. వివేకవంతులు మాత్రము, రజ్జువు (త్రాడు) యందు కల్పింపబడిన సర్పాదులు, సర్పము కంటె భిన్నములు, ఎటుల కావో, అట్లే ఆత్మ వ్యతిరేకముగా, ప్రాణాదులు లేవని భావించుచున్నారు. ఇందులకు శ్రుతి ప్రమాణము. "ఇదం సర్వం యదయ మాత్మా" (బృ.. 4-4-5). ఇట్లే ఆత్మయ ందు కల్పితములైన ప్రాణాదులు, (రజ్జువునందు కల్పింపబడిన సర్పము వలె) వేరుగా లేవనియు, ఆత్మ మాత్రము నిర్వికల్పుడనియు, ఎవడు శ్రుతిచేతను, యుక్తిచేతను, అనుభవముచేతను, నెరుంగుచున్నాడో, వాడు సంశ యము లేక, వేదార్థమును విభాగముగ నిర్ణయింపగలడని యర్థము అనగా "యీ వాక్యము జ్ఞానకాండపరము, ఈ వాక్యము కర్మకాండ పరము' అని నిర్ణయించును. ఆధ్యాత్మవేత్త కానివాడు, వేదార్థమును చక్కగ నెరుంగ జాలడు. అని మానవస్మృతిలో చెప్పబడియున్నది. అదియే ప్రమాణము.

స్వప్నము, మాయ, గంధర్వ నగరము కనులకు అగుపడుచు మరుక్షణములో అభవమొందుచున్నదో, స్వప్నము, మాయ ఎటుల అనద్రూపములో, అట్లే యీ విశ్వమంతయు అసత్తని, వేదాంతములయందు నిపుణ తర వస్తుదర్శులగు పండితుల చేత చెప్పబడినది. దీనికి ప్రమాణం శ్రుతులు : (1) నేహా నానాస్తికించ (బృ.ఉ. 4-4-19) = ఇతనియందు అనేకత్వము లేదు. (2) ఇంద్రోమాయభిః = పరమేశ్వరుడు మాయచేత అనేక రూపము లు గలవాడుగ తోచుచున్నాడు (3) ఆత్మై వేదమగ్ర ఆసీత్ = ఇది ప్రథమమున ఆత్మ స్వరూపముగనే యుండెను.

(4) బ్రహ్మై వేదమగ్ర ఆసీత్ = (ముం.ఉ. 2-2-11) ఇది మొట్టమొదట బ్రహ్మముగనే యుండెను. (5) ద్వితీయాద్వై భయం భవతి (బృ.ఉ. 1-4-2) ద్వైతమున భయము కలుగుచున్నది. (6) సతుత ద్వితీయ మస్తి (బృ.ఉ. 4-3-2 3) ఇచ్చట ద్వైతం లేదు. (7) యత్రత్వస్య సర్వ మాత్మైవాభూత్ (బృ.ఉ.7-5-15) ఎచ్చట అంతయు ఆత్మ ఆత్మ అయి నప్పడు.

పరమార్థ స్థితి :

ఉ॥మం॥ న నిరోధో న చోత్పత్తి । ర్నబద్ధో న చ సాధకః ।
న ముముక్షు ర్నవైముక్తి । ఇత్యేషా పరమార్థతః ॥ ॥32॥

తా॥ ద్వైతము అసత్యమనియు, ఆత్మ ఒక్కటే పరమార్థిక మనియు నిర్ణీత మైనప్పడు, లౌకికము, వైదికము అను సకల వ్యవహారము, అవిద్యా విషయమేయని తెలును. అప్పడు నిరోధ మేదియు లేదు (ప్రళయము), ఉత్పత్తి (పుట్టుక), బద్ధుడు (సంసారి) యగు జీవుడు, సాధకుడు (మోక్షమే సాధనముగా కలవాడు) ముముక్షువు = మోక్షేచ్ఛగల వాడు - ముక్తుడు (వదలిన సంబంధముగల వాడు) లేరు. ఉత్పత్తి ప్రళయములు లేకపోవుటచే బద్ధక, సాధత, ముముక్షు, ముక్తులే, లేరనుట పరమార్థము.

పూ.ప॥ ఉత్పత్తి ప్రళయము లెట్లు లేవు? సమాధానము చెప్పెదను.
ద్వైత మనగా అసత్యము, ఇందుకు శ్రుతి ప్రమాణములు

| | | |
|---|---|---|
| 1) | యత్ర హి ద్వైత మివ భవతి | బ్ర.ఉ. 4-4-14 |
| 2) | య ఇహనా నేవ పశ్యతి | బృ.ఉ. 6-4-19 |
| 3) | ఆత్మై వేదం సర్వం | చాం. ఉ. 7-25-2 |
| 4) | బ్రహ్మై వేదం సర్వం | నృ.ఉ. ఉ.తా. 2 |
| 5) | ఏకమే వా ద్వితీయం | ఛాం.ఉ. (6-2-1) |
| 6) | ఇదం సర్వం యదయ మాత్మ | బృ.ఉ. 4-4-5 |

మున్నగు శ్రుతుల వలన, ద్వైతము అసత్యమని సిద్ధ మగుచున్నది. ఉన్నదానికి (సత్యదార్థమునకు) ఉత్పత్తిగాని, ప్రళయము సంభవించును. కాని లేని శశి విషాణమునకు సిద్ధింపదు. అద్వైతం జనింపదు, నశింపదు. అద్వైతమునకు, ఉత్పత్తి ప్రళయము కలిగి యుండుట పరస్పర విరోధములు గలవి. ప్రాణాది లక్షణమగు ద్వైత వ్యవహార మనునది (రజ్జువునందు సర్పము వలె) ఆత్మయందు కల్పింపబడినది.

5) ప్రేమ స్వరూపుడు - చైతన్యం

"ఈ పాంచ భౌతికమైన దేహము బుడగ వంటిది. ఈ దేహము నందు ఆత్మ అణు స్వరూపము ధరించుట చేత, దేహాత్మ అన్నారు. ఈ సర్వ చైతన్యము, సమస్తములైన పదార్థములను కదిలిస్తుంది. దేహము, జీవుడు, పరమాత్మ, అను 3 తత్వములున్నాయి. కాని దేహాత్మ, జీవాత్మ, పరమాత్మ, ఆత్మ మూడింటి యందు ఒక్కటిగనే యున్నది."

6) సర్వజన ప్రియుడు - (ఒక భక్తుడు)

స్వామికి నైవేద్యం; వేరే పదార్థం అక్కర లేదు. సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి. ఇవి అర్పిస్తే చాలు అన్నారు స్వామి. శరీరం అనే పత్రాన్ని, అడకువ అనే పుష్పాన్ని, దయ, దానం దమములతో కూడిన పవిత్ర హృదయాన్ని, ఆనంద భాష్పాలు అనే కన్నీటిని అర్పించండి చాలును.

7) స్తుతి ప్రియుడు - భజన - సాయీశ్వరుడు
హర హర శంకర సాంబ సదాశివ । ఈశా మహేశా ।
తాండవ ప్రియకర చంద్ర కళాధర । ఈశా మహేశా ॥హ॥
అంబాసుత లంబోదర వందిత । ఈశా । మహేశా ।

వింధ్య హిమాచల సంగనివాసిత । ఈశా మహేశా ॥హ॥

8) వేదాంతవేద్యుడు - రుద్రహృదయోపనిషత్తు

ఉ॥మం॥ ఘటాకాశ మహాకాశే । యథాకాశ ప్రభేదతః ।
కల్పితాషరమౌ జీవ । శివరూపేణ కల్పితా ॥

తా॥ ఆకాశంలో ఘటాకాశమని, మఠాకాశమని ఎట్లు భేదము కల్పింపబడి యున్నదో, అట్లే పరబ్రహ్మము వద్ద జీవేశ్వరులు కల్పింపబడి యున్నారు.

ఉ॥మం॥ తత్తతశ్చ శివ శివసాక్షా చ్ఛిజీవశ్చ స్వత సదా ॥

తా॥ వాస్తవమున శివుడు సాక్షాత్ చ్ఛిత్తేను జీవుడున్ను ఎల్లప్పడును స్వయం చిత్తేను.

ఉ॥మం॥ చిదేకత్వా పరిజ్ఞాన న శోచి ముహ్యతి ।
అద్వైతం పరమానందం । శివం యాంతి కేవలమ్ ।

తా॥ చిత్తు ఒకటేను అను జ్ఞానముచే (జ్ఞాని) శోకమునుగాని మోహమునుగాని పొందుట లేదు. అద్వైత పరమానంద శివుని, మాత్రమే పొందుచున్నారు.

ఉ॥మం॥ అధిష్ఠానాం సమస్తస్య । జగత తస్య చిద్ఘనం ।
అహమస్మీతి నిశ్చిత్య । వీతశోక భవేన్ముని ॥

తా॥ సకల జగత్తున కాధారముగను, సత్యముగను నున్నట్టి చిద్ఘనుడు నేనుగా వున్నానని నిశ్చయించి మునియైనవాడు శోకము లేనివాడగుచున్నాడు.

**ఓం తత్సత్**